క్లుప్తంగా

‘డబుల్’ ఇళ్లను పూర్తి చేయండి



డబుల్ ఇళ్లను పరిశీలిస్తున్న మల్లికార్జున్ రెడ్డి

హుస్నాబాద్: నిలిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశాడు. పట్టణ శివారులో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో 70శాతం ఇళ్ల పనులు పూర్తి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. లక్కీడ్రా ద్వారా ఎంపికైన లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా సోమవారం జిల్లా కేంద్రంలో క్రైస్తవులు శాంతి ర్యాలీని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి నుంచి అంబేడ్కర్ చౌరస్తా, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ప్రధాన వీధుల గుండా సీఎస్ఐ చర్చి వరకు శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ



అంబలిని పంపిణీ చేస్తున్న సభ్యులు

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): ప్రజలు ఎండ వేడిమిని తట్టుకోలేకపోతున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో శ్రీనివాస సేవా సమితి, వికాస తరంగిణిల ఆధ్వర్యంలో ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని గతవారం రోజులుగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఎండలో దాహంతో వచ్చిన వెయ్యి మందికి అంబలిని ఉచితంగా అందిస్తున్నారు. ఈ ఉచిత అంబలి కేంద్రం మే నెల చివరి వరకు కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

పూలే జయంతిని విజయవంతం చేద్దాం

హుస్నాబాద్: మహాత్మాజ్యోతిరావు పూలే జయంతిని హుస్నాబాద్ నియోజకవర్గం కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ లింగాల సాయన్న పిలుపునిచ్చాడు. సోమవారం దళిత, బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ.. మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించడం మన బాధ్యత అని అన్నారు. వారి ఆశయాలను నేటి తరాలకు వివరించాలని కోరారు. ఈ నెల 11న జరిగే జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అంబేడ్కర్ వాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

బెజ్జంకి(సిద్దిపేట): బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న జలదాన కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోటపల్లిలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ సుజాత మాట్లాడుతూ.. బాటసారులకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సుజాత, సుజాత, మానస, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ నర్సాపూర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్‌నగర్, డబుల్ బెడ్రూం కాలనీ, గుండ్ల చెరువు, నర్సాపూర్ ప్రాంతాలలో ఉ.7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ నిలిచిపోనుందని చెప్పారు.

మినీ బస్టాండ్‌లు లేక అవస్థలు

- నిలువ నీడలేక ఎండలోనే పడిగాపులు
- మూత్రశాలలు లేక ప్రయాణికులు ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



రాజీవ్ రహదారిపై మండుటెండలో వేచి చూస్తున్న ప్రజలు

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై మినీ బస్టాండ్‌లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈ రహదారి గుండా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తుంటారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా కరీంనగర్, మంచిర్యాల, గోదావరిఖని, జగిత్యాల, మంథని, సిరిసిల్ల తదితర పట్టణాలకు నిత్యం వందలాది ఆర్టీసీ బస్సుల రాకపోకలు సాగుతుంటాయి. బస్సుల కోసం దర్గా క్రాస్‌రోడ్డు, వెలికట్ట క్రాస్ రోడ్డు, కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, లకుడారం క్రాస్ రోడ్డుల వద్ద ప్రజలు వేచి ఉంటుంటారు. వ్యాపార, వాణిజ్యపరంగా వస్తు సామగ్రి కొనుగోళ్ల కోసం హైదరాబాద్, గజ్వేల్, సిద్దిపేట, కరీంనగర్ తదితర పట్టణాలకు బస్సుల్లో వెళ్తుంటారు.

హైదరాబాద్, సిద్దిపేట, గజ్వేల్ తదితర పట్టణాల్లో నివాసం ఉంటూ కొండపాక మండలం పరిధిలోని కలెక్టరేట్‌లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులతో పాటు దుద్దెడ, కొండపాక, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల శివారుల్లో ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలలకు ప్రతి రోజు విద్యార్థులు పెద్ద సంఖ్యలో వచ్చి బస్సులో వెళ్తుంటారు. అందుకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో పాటు మినీ బస్టాండ్‌ల నిర్మాణాలు లేకపోవడంతో బస్సులు వచ్చేంత వరకు ఎండకు ఎండుతూ వానలో తడుస్తూ ఉండాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలికట్ట క్రాస్ రోడ్డు సమీపంలో ఇంజనీరింగ్ కళాశాల ఉండటంతో జనగామ, చేర్యాల పట్టణాల నుంచి హైదరాబాద్, మేడ్చల్, కరీంనగర్ తదితర పట్టణాల రాకపోకల కోసం 10 నిమిషాల్లో సుమారు 20 నుంచి 30 మంది వరకు ప్రయాణికులు జమ అవుతుంటారు. బస్సుల కోసం వేచి ఉంటున్న సమయంలో నీడ నిచ్చే సౌకర్యం, మూత్రశాలలు లేక పోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి జనం రద్దీగా ఉండే చౌరస్తాల వద్ద మినీ బస్టాండ్‌లు, మూత్ర శాలలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

> ఓ వైపు ఎండలు, మరో వైపు వర్షాలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం ఎదురుచూడటానికి చాలా చోట్ల మినీ బస్టాండ్‌లు లేవు. నిలువ నీడ లేక చెట్లను, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. అలాగే, మూత్రశాలలు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఇటు పాలకులు, అటు ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడం ప్రయాణికులకు ఆందోళన చెందుతున్నారు.

మూత్రశాలలు నిర్మించాలి



జనగామ క్రాస్‌రోడ్డు వద్దకు బస్సుల కోసం 10 నిమిషాల్లో సుమారు 20కి పైనే ప్రయాణికులు చేరుకుంటారు. బస్సులు రావడం ఆలస్యమైనప్పుడు ఎండ, వర్షంలోనే నిలబడుతున్నాం. ముఖ్యంగా మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం, మూత్రశాలలు నిర్మించాలి.

– గోనె శ్రీనివాస్, ప్రయాణికుడు

మినీ బస్టాండ్‌ను నిర్మించాలి



తిమ్మారెడ్డిపల్లి నుంచి సిద్దిపేట, గజ్వేల్, హైదరాబాద్ తదితర పట్టణాలకు ఆయా పనుల, పైచదువుల రీత్యా చాలా మంది ప్రజలు, విద్యార్థులు బస్సుల్లో వెళ్తుంటాం. బస్టాప్‌ల వద్ద మినీ బస్టాండ్‌ల నిర్మాణాలు లేక వేసవి, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మినీ బస్టాండ్‌లను నిర్మించాలి.

– వంగ శ్రీనివాస్, (తిమ్మారెడ్డిపల్లి)

ఏఐతోనే విద్యాబోధన సులభం



అవగాహన కల్పిస్తున్న లక్ష్మీకాంత్

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో విద్యార్థులకు బోధన సులభంగా అర్థమవుతుందని మాస్టర్ మైండ్ పాఠశాల కరస్పాండెంట్ రఘువేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో ఎడోస్ సాఫ్‌వేర్ నిపుణులు లక్ష్మీకాంత్ ఏఐపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు ఏఐ ద్వారా వచ్చే విద్య సంవత్సరం నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో మొట్ట మొదటిసారిగా ఐఐటీ, నీట్, జేఈఈ తరగతులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. తరగతి గదిలో ఏఐ విద్య బోధన చేపట్టడం వల్ల వెనుకబడిన విద్యార్థులను గుర్తించడానికి వీలుంటుందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్, ఉపాధ్యాయులు, మాజీ ఎంపీటీసీ కవిత పాల్గొన్నారు.

ఎర్ర శ్రీకాంత్ మరణం తీరనిలోటు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి



శ్రీకాంత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సిద్దిపేటఅర్బన్: సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీకాంత్ మరణం కార్మిక ఉద్యమానికి తీరనిలోటని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. మధురైలో జరిగిన సీపీఎం అఖిల భారత మహాసభలకు ఖమ్మం నుంచి ప్రతినిధిగా వెళ్లిన ఎర్ర శ్రీకాంత్ గుండెపోటుతో ఆకస్మిక మరణం చెందడం బాధాకరమన్నారు. సోమవారం సిద్దిపేటలోని కార్మిక, కర్షక భవన్‌లో ఎర్ర శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, తునికి మహేశ్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి శిరీష, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయండి



అసంపూర్తిగా ఉన్న భవనం వద్ద విద్యార్థులతో ప్రతాప్‌రెడ్డి

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): నియోజకవర్గంలోని అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ నేత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని దౌలాపూర్ గ్రామంలో కులసంఘాల భవనాలు, ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 80 ఫంక్షన్‌హాల్‌ల నిర్మాణ పనులు, 15 పాఠశాలల భవనాల పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.180 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ అభివృద్ధిపై సీఎం వివక్ష చూపుతున్నారని, ఇక్కడి ఇరిగేషన్ కార్యాలయాలను కొడంగల్‌కు తరలించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు ఉపేందర్‌రెడ్డి, కవితరెడ్డి, యాదవరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న బీజేపీ

చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి



మద్దూర: మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవహేళన చేస్తుందని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామెటీ జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని నరసాయపల్లి, గాగిల్లాపూర్ గ్రామాల్లో సోమవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పాదయాత్రను నిర్వహించారు.

రాజ్యాంగ రక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

సిద్దిపేట అర్బన్: రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ మత రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని వెల్కటూరులో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరుతో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ కుటిల ప్రయత్నాలను మానుకోవాలన్నారు. అంబేడ్కర్‌ను అవమానపరిచిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, మండల అధ్యక్షుడు భిక్షపతి, సతీష్, అంజయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్, కుకునూరుపల్లి గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ నాయకులు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రను నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని మార్చే దిశగా కేంద్రం బీజేపీ ప్రభుత్వం చూస్తుందంటూ ఆరోపించారు.

రాజ్యాంగాన్ని అవమానపరుస్తుంది..



కొమురవెల్లి: సంవిధాన్ యాత్రను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని రసులాబాద్, పోసాన్‌పల్లి, తపాస్‌పల్లి గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ యాత్రను కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగంపై చేసిన వ్యాఖ్యలను ప్రధాని నరేంద్రమోదీ సమర్థించడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆర్డినేటర్ సుంకరి శ్రీనివాస్ రెడ్డి సహాయ కో–ఆర్డినేటర్ భూమిని బాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మెరుగు శ్రీనివాస్ గౌడ్,పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలకు ఆహ్వానం

సిద్దిపేటకమాన్: షెడ్యూల్ కులాల్లోని విద్యార్థులను ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా షెడ్యూల్ కాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ పనిచేస్తుందని సొసైటీ అధ్యక్షుడు మహంకాళి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ ఆపై తరగతులు చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సొసైటీ ఆధ్వర్యంలో ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా అంబేడ్కర్ జయంతి రోజున పురస్కారాలు, నగదు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సొసైటీ సభ్యులను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో సొసైటీ సభ్యులు రామస్వామి, సత్యకృష్ణ, చంద్రం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై ఫిర్యాదు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని కుటికల్ గ్రామంలో ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కుటికల్ గ్రామ శివారులోని వాగు వద్ద ఇసుకను ట్రాక్టర్లలో నింపుతుండగా పట్టుకొని అధికారులకు అప్పగించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో వాగును తోడేస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

కోరిన కోర్కెలు తీర్చే లక్ష్మీనారసింహుడు

- నేడు స్వామివారి తిరుకల్యాణం
- బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



లక్ష్మీనరసింహస్వామి ఆలయం

బెజ్జంకి(సిద్దిపేట): కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏటా చైత్ర శుద్ధమాసంలో వచ్చే స్వామివారి బ్రహ్మోత్సవాలు చైత్ర బహుల సప్తమి రోజున ముగుస్తాయి. ఈ ఉత్సవాలకు సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్‌లతో పాటు మహారాష్ట్రలోని ముంబాయి, బీవండి, షోలాపూర్, కర్ణాటకలోని బల్లార్ష తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డ భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

ఉత్సవాల్లో ముఖ్య ఘట్టాలు

8న మంగళవారం నుంచి 20వ తేదీ ఆదివారం వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల వాహనాలపై ప్రతి రోజు గ్రామ పురవీధులు గుండా ఊరేగిస్తారు. బ్రహ్మోత్సవాల కోసం వచ్చే భక్తుల సౌకర్యాల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎండోమెంట్, ఆలయ అధికారులు తెలిపారు. కరీంనగర్, సిద్దిపేట, హుస్నాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్‌లను ప్రత్యేకంగా నడపనున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడప గ్రామంలో దుర్గమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో దుర్గమ్మ ఆలయం శిథిలావస్థకు చేరింది. ఆలయ పునర్నిర్మాణానికి తనవంతుగా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, ప్రసాద్, స్వామి, శ్రీను, కిషన్, సత్తయ్య పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



మజ్జిగ పంపిణీ చేస్తున్న నవీన్‌కుమార్, తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ ముందుండాలని, డాక్టర్ మాంకాల నవీన్ కుమార్ అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ, వృద్ధాశ్రమంలో వృద్ధులకు రైస్ కుక్కర్‌ను అందించారు. ప్రతి ఒక్కరు తమ జన్మదినం, వివాహ దినోత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో వాసవిక్లబ్, వనిత క్లబ్, ఆర్యవైశ్య మహా సభ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రతిభను చాటినప్పుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటినపుడే గుర్తింపు లభిస్తుందని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని యూపీఎస్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, నెట్‌ను అందజేశా రు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల అభ్యున్నతికి తమ వంతు సహకారంతో క్రీడాజ్యోతి ఫౌండేషన్ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఆటల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు విజయరేఖ, గోవర్ధన్‌రెడ్డి, నరేష్‌కుమార్, నవీన్, ఉపాధ్యాయినీలు విద్యార్థులు పాల్గొన్నారు.

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పలు ప్రాంతాల్లో వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చె ప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చ గా న్యాయమూర్తి రూ.20,500 జరిమానా ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

నిబంధనలు తప్పనిసరి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద నిర్వహించిన తనిఖీల్లో 14 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. వారిని సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ముందు హాజరుపర్చగా విచారించి 14 మందికి రూ.4700 జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



గజ్వేల్‌రూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదవరెడ్డి, నరేందర్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అహ్మదీపూర్, జాలిగామ, గిరిపల్లి గ్రామాల్లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గాప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు

◆ కొనుగోలు కేంద్రాలతో ప్రయోజనం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో చాట్లపల్లి, మునిగడప గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసం పోవద్దన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కిరణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ప్రతినిధులు నరేష్, బాలలక్ష్మి, సీసీలు బాబు, అనురాధ, చంద్రకళ, రమేష్‌రెడ్డి, రవి, దేవరాజ్, రేణుక, ఏఈఓలు పాల్గొన్నారు.

◆ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి మార్కెట్ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత అన్నారు. మండల పరిధిలోని వీరన్నపేట, చుంచనకోట, ముస్త్యాల, వేచరేణి, తాడూరు, చిట్యాల, నాగపురి, శభాష్ గూడెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగార వీరన్నపేట కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.

◆ పత్తి మార్కెట్ యార్డులో..

సిద్దిపేటజోన్: స్థానిక పత్తి మార్కెట్ యార్డులో పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఏ గ్రేడ్ మద్దతు ధర రూ. 2320, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2300 ప్రకటించిందన్నారు. అదనంగా సన్నరకం ధాన్యానికి రూ.500 చెల్లిస్తుందని పేర్కొన్నారు.

◆ జనగామలో..



అక్కన్నపేట: జనగామలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లింగమూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ, గోవర్ధనగిరి, జనగామ,నందారం, ధర్మారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు మద్దతు ధర లభించాలంటే కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఏపీఎం శ్రీనివాస్ గౌడ్, సీసీలు శివ చరణ్ సింగ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.